





# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఆగస్ట్ 29 2025 | సంపుటి :0 | సంచిక :313 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# కూలిన ప్రాజెక్టుకు..

## నిలబడిన ప్రాజెక్టుకు తేడా ఉంది: సీఎం రేవంత్‌రెడ్డి




పెద్దపల్లి: గోదావరి జలాలను తెలంగాణలో ఎక్కడికి తరలించాలన్నా ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రాణవాయువు లాంటిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. స్ట్రాటజిక్ లోకేషన్‌తో కట్టిన ప్రాజెక్టు శ్రీపాద ఎల్లంపల్లి అని.. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టుకు మధ్య తేడా ఉందన్నారు. నిపుణులు కట్టిన ప్రాజెక్టు కాబట్టే ఎల్లంపల్లి దశాబ్దాలుగా నిలబడిందని పేర్కొన్నారు.

మేడిగడ్డ పనికిరాకుండా పోయింది. మేడిగడ్డ రిపేరు చేయకుండా.. అన్నారం, సుందిళ్లలో నీరు నిల్వ చేయొచ్చు కదా? అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిచ్చారు. అతి తెలివితేటలతో మామ, అల్లుడు .. ఒకరు స్వాతి ముత్యం, మరొకరు ఆణిముత్యం అనుకుంటారు. మేడారం, అన్నారం, సుందిళ్ల.. మూడు బ్యారేజీలు ఒకే రకమైన సాంకేతిక నైపుణ్యంతో నిర్మించారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి అన్నారంలో పోయాలి, అక్కడి నుంచి సుందిళ్ల, శ్రీపాద ఎల్లంపల్లిలో పోయాలి. 3 బ్యారేజీల డిజైన్‌లో, నిర్మాణంలో, నిర్వహణలో లోపం ఉంది. ఏదైనా ప్రమాదం జరిగేతే గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోతాయి. మేం.. 80వేల పుస్తకాలు చదవలేదు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావిని సలహా అడుగుతున్నాం ఏం చేద్దామని. మేడిగడ్డ విషయంలో సాంకేతిక కమిటీ సూచనల ప్రకారం వెళ్తాం. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించి ముందుకెళ్తాం" అని సీఎం స్పష్టం చేశారు. వరద పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న సీఎం.. పలు సూచనలు చేశారు.

## మామ, అల్లుడు ఎన్ని కుట్రలు చేసినా పాపాలు పోవు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గోదావరి జలాలు గుండెకాయ అని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని పేర్కొన్నారు. మామ, అల్లుడు ఎన్ని కుట్రలు చేసినా పాపాలు పోవని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

పేజ 2లో ▶




## తెలంగాణలో వరదలు..

సహాయం కోసం డయల్ 100కు కాల్ చేయండి: డీజీపీ జితేందర్



2లో ▶

## సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్.. ఇక 20 కోచ్‌లు!



2లో ▶

## పేలుళ్ల అనుమతులకు స్పష్టమైన విధివిధానాలు ఉండాలి: హైకోర్టు సీజే



2లో ▶

హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లోని న్యాయవిహార్ సమీపంలో పేలుళ్లకు ఎవరు అనుమతి ఇచ్చారని తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్ ప్రశ్నించారు. ఈ మేరకు దాఖలైన పిల్‌పై హైకోర్టులో విచారణ జరిగింది.

## వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



మిగతాది 2లో

- వరదల్లో మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.
- మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల పరిహారం, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్.
- పోచారం వద్ద వరదల్లో గల్లంతైన ఇద్దరిలో ఒకరి మృతదేహం లభ్యమైంది, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## వర్షం పూర్తిగా ఆగే వరకు సహాయక చర్యలు కొనసాగించాలి: మంత్రి సీతక్క



మిగతాది 2లో

- వరద ప్రభావిత ప్రాంతాల్లో వెంటనే పర్యటించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు ఆదేశం.
- ముంపులో ఉన్న ఇళ్ల నుంచి నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలి.
- విద్యుత్, వ్యవసాయ, తాగునీరు, పంచాయతీరాజ్ శాఖలు తక్షణమే నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలి.
- అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు మనోధైర్యం కల్పించాలి.




## మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలె: మాజీ మంత్రి కేటీఆర్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వరద ప్రాంతాల్లో పర్యటించిన మాజీ మంత్రి

పేజి 2లో ▶

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో ఉప్పు నిప్పులా ఉంటే కేంద్ర మంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి కేటీఆర్ ను వరద కలిపింది. వీళ్లి ద్దరూ అనూహ్యంగా వరద ప్రాంతాల పర్యటన లో కలుసుకున్నారు. గురువారం (ఆగస్టు 28) వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సందర్భంగా కలవడంతో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. సిరిసిల్లలో పరద బాధిత ప్రాంతాలలో బండి సంజయ్ పర్యటించి వెలు తున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా అక్కడికి చేరుకున్నా రు. యాదృచ్ఛికంగా ఎదురెదురు పడటంతో మర్యాద పూర్వకంగా కలుసుకుని పరస్పరం అభివాదం కరచాలనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరు ఏం మాట్లాడుకున్నారన్నదానిపై స్పష్టత లేదు. ఈ క్రమంలో రెండు పార్టీల నాయకులు ఈ ఆకస్మిక పరిణామాన్ని ఆస్వాదిస్తూ కేరింతలు కొడుతూ బండి, కేటీఆర్ ల నాయకత్వం వర్ధిల్లాలంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు.

# సంపాదకీయం

## నేరచరితుల ఆటకట్టు సాధ్యమేనా

నీకెంత సేన ఉన్నా వ్యూహం లేకపోతే నీవు జనరల్ కాలేవు.. అన్న ఒక సైనిక నిపుణుడి ఉవాచ రాజకీయాలకు కూడా వర్తిస్తుంది. రాజకీయాల్లో వ్యూహరచన చేసే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంత సిద్ధహస్తుడు మరొకరు లేరు. 2029లో జరిగే సార్వత్రక ఎన్నికలకు ఆయన ....

నీకెంత సేన ఉన్నా వ్యూహం లేకపోతే నీవు జనరల్ కాలేవు..' అన్న ఒక సైనిక నిపుణుడి ఉవాచ రాజకీయాలకు కూడా వర్తిస్తుంది. రాజకీయాల్లో వ్యూహరచన చేసే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంత సిద్ధహస్తుడు మరొకరు లేరు. 2029లో జరిగే సార్వత్రక ఎన్నికలకు ఆయన ఇప్పటి నుంచే సిద్ధపడుతున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొద్ది రోజుల క్రితమే వెల్లడించారు. దీన్నిబట్టి చూస్తే వచ్చే సెప్టెంబర్ నెలాఖరులో షెడ్యూలు ప్రకటించబోతున్న బిహార్ ఎన్నికలకు ఆయన ఎంత ముందుగా సన్నాహాలు చేసి ఉంటారో వేరే చెప్పనక్కర్లేదు. సాధారణంగా ఏవైనా ఎన్నికలకు ముందు పార్లమెంట్ సమావేశాలు పెద్దగా జరిగే అవకాశాలు లేవు. పార్లమెంట్‌లో లేవనెత్తే అంశాలే తర్వాత జరగబోయే ఎన్నికలకు ప్రధాన ప్రచారాస్త్రాలవుతాయని అటు అధికార పక్షానికీ, ఇటు ప్రతిపక్షాలకూ తెలుసు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చను తమకు అనుకూలంగా తిప్పుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తే బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ, గత మేలో పాకిస్థాన్‌పై ప్రారంభించిన యుద్ధాన్ని ఆకస్మికంగా విరమించడం లాంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి. ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసేందుకు కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. దీనితో మోదీ ప్రభుత్వం తన వ్యూహరచనపై పునరాలోచనలో పడ్డది. నిజానికి ఆగస్టు 12నే ఉభయ సభలను వాయిదా వేయాలని తొలుత నిర్ణయం తీసుకుని ఆ విషయం ఫ్లోర్ నేతల సమావేశంలో తెలియజేశారు. కాని మోదీ, షా ఏమి ఆలోచించారో కానీ ఆమోదించాల్సిన బిల్లులేవీ లేకున్నా యథా ప్రకారం ఆగస్టు 21 వరకు పార్లమెంట్‌ను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 19 రాత్రి పొద్దుపోయిన తర్వాత ఉన్నట్లుండి 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, అందుకు సంబంధించిన ఇతర బిల్లులను మరునాడు ప్రవేశపెట్టనున్నట్లు బులెటిన్ విడుదల చేశారు. పార్లమెంట్ సభ్యులు అందరికీ బిల్లుల ప్రతిని పంపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు అయిదేళ్లపాటు శిక్షపడదగిన నేరానికి అరెస్టయి నెలరోజులపాటు జైలులో ఉంటే రాజీనామా చేయాలని, లేకపోతే వారు ఆ పదవులను కోల్పోయినట్లేనని ఈ బిల్లు సారాంశం. ఇప్పటి వరకూ మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రిని పోస్టుల నుంచి తొలగించేందుకు చట్టపరమైన నిబంధనలేవీ లేవు. లిల్లీ థామస్ కేసులో ఎమ్మెల్యే, ఎంపీలకు రెండేళ్లు, అంతకు మించి శిక్ష పడితే వారు సభ్యులుగా కొనసాగకూడదని 2013లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసు ఆధారంగానే గుజరాత్‌లో సూరత్ కోర్టు ఒక పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీకి రెండేళ్ల శిక్ష విధించడంతో ఆయన సభ్యత్వాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

అసలీ బిల్లును ఇంత ఆగమేఘాలపై ఎందుకు ప్రవేశపెట్టాల్సి వచ్చింది? జమిలి ఎన్నికల వంటి ముఖ్యమైన అంశంపై అఖిలపక్ష సమావేశాల్లో చర్చించిన ప్రభుత్వం ప్రధాన పదవుల్లో ఉన్నవారి నేర చరిత్ర గురించి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ముందు ఎవరితోనూ చర్చించనవసరం లేదా? అందుకోసం కనీసం కేబినెట్ సమావేశంలోనైనా చర్చ జరిగిందా? అన్న ప్రశ్నలకు జవాబులు లేవు. అసలీ దేశంలో ప్రధానమంత్రులను కేంద్ర సంస్థలు ఎప్పుడైనా అరెస్టు చేసే అవకాశాలున్నాయా? అన్నది ఆసక్తికరమైన ప్రశ్న. విచిత్రమేమంటే కస్టడీ నుంచి విడుదలైన తర్వాత మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి, మళ్లీ పదవులు స్వీకరించేందుకు ఎలాంటి అడ్డంకులూ లేవని కూడా ఈ బిల్లు పేర్కొంటోంది. అటువంటప్పుడు ఈ బిల్లు ప్రవేశపెట్టడం వల్ల ప్రయోజనమేమిటి? ఈ బిల్లుకు ప్రచారం కంటే పెద్ద ప్రయోజనం లేదని అధికారపక్షానికి తెలియనిది కాదు. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నందువల్ల దాన్నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ బిల్లు ప్రవేశపెట్టారన్న విశ్లేషణలూ లేకపోలేదు. ప్రభుత్వం ఊహించినట్లుగానే బిల్లుపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. తద్వారా అవినీతిపై తాము చేస్తున్న పోరాటాన్ని వారు వ్యతిరేకిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, ఇతర నేతలు ఆరోపించేందుకు ఆస్కారం కలిగింది. ఏమైనా ఈ నేపథ్యంలో బిహార్ ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయనడంలో సందేహం లేదు. రాహుల్‌గాంధీ ఇప్పటికే యాత్రలు ప్రారంభించి ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. పహల్గాం దాడి కాగానే మోదీ కూడా బిహార్‌కే వెళ్లి పాకిస్థాన్‌కు బుద్ధి చెబుతానని ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌కు తోడు రాజ్యాంగ సవరణ బిల్లు కూడా ప్రతిపక్షాలను ఎండగట్టేందుకు మోదీ సేన ఉపయోగించుకుంటుందనడంలో సందేహం లేదు. రాజ్యాంగ సవరణ బిల్లు పట్ల ప్రతిపక్షాలు ఆందోళన చెందేందుకు కారణాలు లేకపోలేదు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కుప్పకూల్చేందుకు కేంద్రం సీబీఐ, ఈడీ వంటి కేంద్ర ఏజెన్సీలను తప్పక ఉపయోగించుకోగలదని విపక్షాలు గట్టిగా విశ్వసిస్తున్నాయి. మనీలాండరింగ్ చట్టం ప్రకారం ఒక ముఖ్యమంత్రిని కానీ, మంత్రిని కానీ అరెస్టు చేస్తే వారికి 30 రోజుల వరకు బెయిల్ దొరికేందుకు అవకాశం లేదు. అదే అదనుగా వారిని తొలగించవచ్చు. ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తే అధికారంలో ఉన్న ప్రభుత్వం కుప్పకూలిపోతుందని లేదా అధికారంలో ఉన్న పార్టీలో లుకలుకలు బయలుదేరుతాయనేది కూడా ప్రతిపక్షాల వారి ఆందోళన. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు ముఖ్యమంత్రి పదవికోసం మంత్రి పదవులకోసం అర్రులు చాస్తూ ఉంటారు. కనుక ఆ పార్టీని దెబ్బతీయడం కేంద్రంలో ఉన్న పార్టీకి సులభం.

ఈ బిల్లు ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వానికి అనేక కారణాలున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో అరెస్టయి 156 రోజులు జైలులో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. ఆయన మంత్రివర్గంలో ఉన్న సత్యేంద్ర జైన్ హవాలా కేసులో అరెస్టయినప్పటికీ చాలా కాలం మంత్రి పదవిలో కొనసాగారు. తమిళనాడులో కూడా డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ తన మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్టయి జైలుపాలైనప్పటికీ అతడిని మంత్రివర్గంలో కొనసాగించారు. మంత్రివర్గం నుంచి తొలగించాలని గవర్నర్ రవి ఆదేశించినప్పటికీ స్టాలిన్ ఒప్పుకోలేదు. నిజానికి గతంలో ఆరోపణలు వచ్చినా, కోర్టు వ్యాఖ్యలు చేసినా, తమ మంత్రిత్వశాఖ పరిధిలో ఏవైనా దుర్ఘటనలు జరిగినా మంత్రులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసేవారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాపిటేషన్ ఫీజులపై హైకోర్టు తప్పుపట్టడంతో ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డిని రాజీనామా చేయించారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న యడ్యూరప్ప, తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత, బిహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ తమను అరెస్టు చేయకముందే పదవులనుంచి తప్పుకున్నారు. రాజకీయ నాయకులు చాలా మందికి ఈ అరెస్టుల వల్ల పెద్దగా నష్టం జరిగిన దాఖలాలు లేవు. హేమంత్ సోరెన్ జైలు నుంచి వచ్చిన తర్వాత ఎన్నికల్లో పోరాడి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. లాలూప్రసాద్ తాను అరెస్టయ్యే ముందు రబ్రీదేవిని ముఖ్యమంత్రి చేసినప్పటికీ ఆయన ప్రభుత్వం పడిపోలేదు. జయలలిత తాను అరెస్ట్ అయిన రెండుసార్లూ ఒకసారి పన్నీర్‌సెల్వన్‌ను, రెండవసారి పళనిస్వామిని ముఖ్యమంత్రి చేశారు. రెండుసార్లూ ఆమె ప్రభుత్వానికి పెద్దగా ఢోకా రాలేదు. గత ఏడాది జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టుకు ముందే రాజీనామా చేసి చంపాయి సోరెన్‌ను ముఖ్యమంత్రి చేశారు. బహుశా కేజ్రీవాల్ కూడా ముందే రాజీనామా చేసి ఉంటే మళ్లీ మెజారిటీ సాధించేవారేమో. అప్పుడు కేంద్రం ఈ బిల్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం కూడా ఉండేది కాదు.అయినా ప్రభుత్వాలను పడగొట్టాలంటే ఇలాంటి బిల్లులు ఏ మాత్రం అవసరం లేదు. గతంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్దవ్ థాకరే, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రభుత్వాలను పడగొట్టేందుకు బీజేపీ వేర్వేరు మార్గాలను అనుసరించింది. ముఖ్యమంత్రులనో, మంత్రులనో అరెస్టు చేసినంత మాత్రాన ప్రభుత్వాలు పడిపోతాయని చెప్పడానికి లేదు. పైగా అసంబద్ధంగా కుట్రపూరితంగా అరెస్టులు జరిగితే న్యాయవ్యవస్థ చేతులు ముడుచుకుకూర్చునే అవకాశాలు తక్కువ. కేంద్రం కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, మంత్రులను కేసుల్లో ఇరికిస్తే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర మంత్రులపై తమ పోలీసులను, ఏజెన్సీలను ప్రయోగించేందుకు పూనుకోవచ్చు. ఇది ఒక గందరగోళ పరిస్థితికి దారితీస్తుంది. అయినా ఇప్పుడున్న కేంద్ర ఏజెన్సీలనే రాష్ట్ర నేతలపై ప్రయోగించే అవకాశం ఉండగా రాజ్యాంగ సవరణ తేవాల్సిన అవసరం ఏమున్నది? రాజకీయాల్లో నేరచరితులను అంతం చేయడానికి చిత్తశుద్ధి ఉంటే అందుకు సవాలక్ష మార్గాలున్నాయి.

# సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్.. ఇక 20 కోచ్‌లు!

మొదటిపేజీ తరువాయి

వందేభారత్‌కు లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్-తిరుపతి సహా ఏడు మార్గాల్లో నడిచే వందేభారత్ రైళ్ల కోచ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. సికింద్రాబాద్-తిరుపతి, మంగళూరు సెంట్రల్-తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి, మదురై-బెంగళూరు కంటోన్మెంట్, దేవ్‌గఢ్-వారణాసి, హవ్‌డా-రౌర్కెలా, ఇండోర్-నాగ్‌పూర్ మధ్య నడిచే వందేభారత్ రైళ్లలో ఎక్కువ కోచ్‌లు అందుబాటులో ఉండనున్నాయి.

### వణికిస్తున్న వర్షాలు.. 50కి.మీ మేర ట్రాఫిక్ జామ్

ప్రస్తుతం మూడు మార్గాల్లో 16 కోచ్‌లు, నాలుగు రూట్‌లలో ఎనిమిది కోచ్‌ల వందేభారత్ రైళ్లు నడుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 16 కోచ్‌ల రైలును 20 కోచ్‌లతో, ఎనిమిది కోచ్‌ల రైళ్ల స్థానంలో 16 కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రజా సంబంధాలు) దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (జులై 31, 2025 నాటికి) వందేభారత్ రైళ్ల రద్దీ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని వీటిని అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

### సికింద్రాబాద్-తిరుపతి 20 కోచ్‌లు..

సికింద్రాబాద్-తిరుపతి సహా మంగళూరు సెంట్రల్- తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి మార్గాల్లో ప్రస్తుతం 16 కోచ్‌ల వందేభారత్ నడుస్తుండగా.. దీనిని 20 కోచ్‌లకు పెంచనున్నారు. మిగతా నాలుగు మార్గాల్లో ఎనిమిది కోచ్‌ల రైళ్లు నడుస్తుండగా.. వాటి స్థానంలో 16 కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడు మార్గాల్లో కోచ్‌ల అప్‌గ్రేడ్‌తోపాటు మరిన్ని 20 కోచ్‌ల వందేభారత్ రైళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. కొత్తగా వచ్చే 16, 8 కోచ్‌ల రైళ్లను కొత్త మార్గాల్లో ఉపయోగిస్తామన్నారు.

# పేలుళ్ల అనుమతులకు స్పష్టమైన విధివిధానాలు ఉండాలి: హైకోర్టు సీజే

మొదటిపేజీ తరువాయి

పోలీసుల అనుమతితో పేలుళ్లు నిర్వహించారని గనులశాఖ తరపు న్యాయవాది తెలపగా.. బ్లాస్టింగ్ తీవ్రత, రాళ్లు ఎంతదూరం పడతాయనే అంశాలపై పోలీసులకు అవగాహన ఉంటుందా అని సీజే ప్రశ్నించారు. సిటీ పోలీస్ యాక్ట్ కింద అనుమతి ఇచ్చినట్లు చెబుతున్నారని.. నగరంలో భారీగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. పేలుళ్ల అనుమతులకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు ఉండాలని జస్టిస్ ఏకే సింగ్ అభిప్రాయపడ్డారు.

ఇళ్ల నిర్మాణంలో భాగంగా భారీ పేలుళ్లు నిర్వహిస్తున్నారని సీజే ధర్మాసనానికి ఓ న్యాయమూర్తి లేఖ రాశారు. భారీ పేలుళ్లతో రాత్రివేళ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యాయమూర్తి లేఖలో పేర్కొన్నారు. గుట్టలను యథేచ్ఛగా తొలగించడం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు. ఆ లేఖను ధర్మాసనం గతేడాది సెప్టెంబర్‌లో సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది. తాజాగా మరోసారి విచారణ సందర్భంగా అనుమతితోనే పేలుళ్లు నిర్వహించారని.. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు బ్లాస్టింగ్‌కు అనుమతి ఉందని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ కోర్టుకు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు ఆయన సమయం కోరారు. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 16కి వాయిదా వేసింది.

# వర్షం పూర్తిగా ఆగే వరకు సహాయక చర్యలు కొనసాగించాలి: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు పర్యటించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కామారెడ్డి జిల్లాలో వరద పరిస్థితిపై ఆమె అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల ఇళ్లను పరిశీలించి, ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ముంపులో ఉన్న ఇళ్ల నుంచి నీరు బయటికి పంపే చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్, వ్యవసాయ, తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖలు తక్షణం నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు మనోధైర్యం కల్పించాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. వాగులు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని.. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. త్వరలోనే జిల్లాలో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తానని సీతక్క తెలిపారు.

అధికారులు జిల్లాలోని వర్షాల తీవ్రత, వరద ఉద్ధృతి, నష్ట పరిస్థితులపై మంత్రికి వివరాలు అందించారు. వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ, అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. వర్షం పూర్తిగా ఆగే వరకు సహాయక చర్యలు నిరంతరం కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్, ఎస్పీ, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# : మహిళలకు సురక్షితమైన నగరాల్లో విశాఖ

దేశంలో మహిళలకు సురక్షితమైన నగరాల్లో కోహిమా, విశాఖపట్నం, భువనేశ్వర్, ఆయిజోల్, గాంగ్‌టోక్, ఇటానగర్, ముంబయి టాప్‌లో నిలిచాయి. పట్నా, జైపుర్, ఫరీదాబాద్, దిల్లీ, కోల్‌కతా, శ్రీనగర్, రాంచీలు దిగువన ఉన్నాయి. 'మహిళా భద్రతపై జాతీయ వార్షిక నివేదిక, సూచీ- 2025'లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా 31 నగరాల్లో 12,770 మంది మహిళలపై నిర్వహించిన సర్వే ఆధారంగా దీన్ని రూపొందించారు. మహిళల విషయంలో జాతీయ భద్రతా స్కోరు 65 శాతంగా తేలింది. నివేదిక లోని కీలక అంశాలను పరిశీలిస్తే..

కోహిమా, విశాఖపట్నం వంటి నగరాలు మెరుగైన స్త్రీ-పురుష సమానత్వం, మహిళా అనుకూల మౌలిక సదుపాయాలు, పకడ్బందీ పోలీసింగ్, పౌర భాగస్వామ్యం కలిగి ఉన్నాయి. కోల్‌కతా, దిల్లీ వంటి నగరాల్లో మౌలిక సదుపాయాల లేమీ, పితృస్వామ్య నిబంధనల వంటివి వేధిస్తున్నాయి.

60 శాతం మంది తమ నగరాల్లో సురక్షితంగా ఉన్నారని భావించారు. 40 శాతం మంది అంత సురక్షితంగా లేమని, ఇది సురక్షిత నగరం కాదని తెలిపారు. రాత్రిపూట భద్రత అంతంతమాత్రమేనని, ముఖ్యంగా ప్రజారవాణా, వినోద ప్రదేశాల్లో సమస్య ఎక్కువగా ఉందని చెప్పారు. విద్యాసంస్థల్లో పగటిపూట సురక్షితంగా (86 శాతం) ఉన్నప్పటికీ.. రాత్రిపూట లేదా క్యాంపస్ వెలుపల ఇది తక్కువే.

91 శాతం మంది పని ప్రదేశంలో సురక్షితంగా ఉన్నామని తెలిపారు. కానీ.. సగం మందికి లైంగిక వేధింపుల నివారణ విధానాల గురించి తెలియదు. ఇవి అమల్లో ఉన్న చోట మాత్రం చాలావరకు ప్రభావవంతంగా ఉన్నట్లు తేలింది.

భద్రతా ఫిర్యాదులను సమర్థంగా పరిష్కరించే విషయంలో 25 శాతం మంది మాత్రమే అధికార యంత్రాంగాన్ని విశ్వసించారు. 69 శాతం మంది ప్రస్తుత భద్రతా చర్యలు కొంతవరకే సరిపోతాయని భావించారు. 30 శాతం మంది తీవ్ర అంతరాలను గుర్తించారు. ఏడు శాతం మంది మహిళలు 2024లో బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. 24 ఏళ్లలోపు వారిలో ఇది 14 శాతానికి పెరిగింది. ఇరుగు పొరుగు ప్రాంతాలు (38 శాతం), ప్రజారవాణా వ్యవస్థలు (29 శాతం) వేధింపులకు హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి. ప్రతి ముగ్గురిలో ఒకరు మాత్రమే వేధింపులపై ఫిర్యాదు చేశారు.

మహిళా విద్య, ఆరోగ్యం, ఉపాధి, రాకపోకల విషయంలో భద్రత ఎంతో కీలకమని జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ పేర్కొన్నారు. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, డిజిటల్‌పరంగా భద్రత అవసరమన్నారు. ఇది ఉమ్మడి బాధ్యత అని.. హెల్ప్‌లైన్‌ల వినియోగం, అవగాహన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం వంటి చర్యల ద్వారా దీనికి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళా పోలీసు అధికారుల సంఖ్య పెరగడం, స్మార్ట్ సిటీల్లో సీసీటీవీల ఏర్పాటు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో మెరుగైన భద్రతా నెట్‌వర్క్ వంటి చర్యలను ప్రశంసించారు.

# మామ, అల్లుడు ఎన్ని కుట్రలు చేసినా పాపాలు పోవు

మొదటిపేజీ తరువాయి

కామారెడ్డి, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నాయి. కుండపోతగా కురుస్తున్న వానలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో వచ్చిన వరదలతో పలువురు చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(గురువారం) ఏరియల్ సర్వే నిర్వహించారు.

సీఎం బృందం బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి పెద్దపల్లి జిల్లాకు చేరుకున్నారు. ఏరియల్ వ్యూ ద్వారా గోదావరి, ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ సీఎస్, డీజీపీ జితేంద్ర, తదితరులు ఉన్నారు.

ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చ పెడతాం..

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గోదావరి జలాలు గుండెకాయ అని ఉద్ఘాటించారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని పేర్కొన్నారు. మామ, అల్లుడు ఎన్ని కుట్రలు చేసిన పాపాలు పోవని విమర్శించారు. అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యమని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీళ్లు నింపితే గ్రామాలే కొట్టుకుపోతాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలు ఉన్నాయని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో సాంకేతిక వైఫల్యం ఉందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ లోపం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

మొదటిపేజీ తరువాయి

మెదక్: వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు.మెదక్‌లోని జీకేఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

"పోచారంలో నిన్న ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది.. మరొకరి కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. మెదక్‌జిల్లాలో పునరుద్ధరణ పనుల కోసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ రూ. కోటి వరద సాయం ప్రకటించారు. మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల సబ్‌స్టేషన్ పూర్తిగా నీట మునిగింది. ఆ ఒక్క సబ్ స్టేషన్ పునరుద్ధరించాలంటేనే రూ.3 కోట్లు ఖర్చవుతాయి. రహదారులు కొట్టుకుపోయాయి, అనేక మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. లోతట్టు ప్రాంతాలన్నీ ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. విపత్తు సాయం పెంచాలని, మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున పరిహారం, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం హెలికాప్టర్ పంపడంలో ఆలస్యం కావడం వల్లే ఆ ఇద్దరు చనిపోయారని గ్రామస్థులు బాధపడుతున్నారు. రామాయంపేట- సిద్దిపేట మధ్య జాతీయ రహదారిలో నందిగామ వద్ద పాత బ్రిడ్జినే జాతీయ రహదారికి అనుసంధానించడం వల్ల అది దెబ్బతిని రాకపోకలకు ఆటంకమేర్పడింది. పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలి" అని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు.

# మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలె: మాజీ మంత్రి కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

రాజన్న సిరిసిల్ల: వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లిం చాలని అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో కేటీఆర్ పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

వరదలు ముంచెత్తుతుంటే.. మూసీ సుందరీకరణ, ఒలిం పిక్స్ క్రీడల గురించి సీఎం సమీక్ష చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం పని చేయకపోయి నా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని కొనియాడారు.

# తెలంగాణలో వరదలు..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఉత్తర తెలంగాణను భారీ వర్షాలు ముంచెత్తాయి. భారీ వర్షాల వల్ల 10 మంది వరకు చనిపోయి ఉండొచ్చని అనుకుంటున్నామని, మరణాలపై ఇంకా స్పష్టత రాలేదని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న దాదాపు 2వేల మందిని రక్షించినట్టు చెప్పారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఆర్మీ సాయంతో రెండు హెలికాప్టర్ల ద్వారా బాధితులను రక్షించినట్టు డీజీపీ వివరించారు. సహాయక చర్యల కోసం డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

రెండు వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు చేసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఒకవైపు గణేష్ ఉత్సవాలు ఉన్నప్పటికీ.. వరదలపై పోలీసు శాఖ పోరాటం చేస్తోందని తెలిపారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం తరలించేందుకు డీజీపీ కార్యాలయంలో కూడా అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచామని డీజీపీ తెలిపారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# 35 వేలమందితో విఘ్నేశ్వరుడికి 'అథర్వశీర్ష'



పుణె: వినాయక నవరాత్రులు వచ్చాయంటే విభిన్న రూపాల్లో కనిపించే గణపతులే కాదు.. మండపాల్లోని అలంకారాలు, సాంస్కృతిక కార్యక్రమాలూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. అలా మహారాష్ట్రలోని పుణెలో శ్రీమంత్ దగ్దుషేత్ హల్వాయి గణపతి మందిరంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 35 వేల మంది మహిళలు గణేశ్ అథర్వశీర్షను ఆలపించారు.

సుమారు 133 ఏళ్లుగా ఈ ఆలయంలో గణేశ్ ఉత్సవాలు జరుగుతున్నాయి. గడిచిన 40 ఏళ్లుగా అథర్వశీర్ష పారాయణం నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి నుంచే మహిళా భక్తులు మండపానికి సంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ భార్య, ఎంపీ సునేత్ర పవార్ పాల్గొన్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

# జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- వాగులు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలి**
**- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
సంగారెడ్డి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు.
జిల్లాలో కురిసిన వర్షాలపట్ల అన్ని శాఖలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. గురువారం సంగారెడ్డి పట్టణ పరిధిలోని రేణిగుంట ఎర్రగుంట, మాసాను కుంట చెరువులు వరదనీటితో పొంగిపొర్లుతున్న నేపథ్యంలో కలెక్టర్ స్వయంగా పర్యటించారు. రేణిగుంట చెరువులో ఏర్పడిన గండిని పరిశీలించిన కలెక్టర్ తక్షణ మరమ్మత్తులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని, నీరు సవ్యంగా కిందికి పారేలా మార్గాలు కల్పించాలని ఆమె సూచించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ వాగులు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, రెవెన్యూ, పోలీస్, నీటి పారుదలశాఖ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. జిల్లాలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08455 - 276155 ఏర్పాటు చేయబడిందని కలెక్టర్ తెలిపారు. కొనసాగుతున్న వర్షాల దృష్ట్యా, సంబంధిత అన్ని విభాగాలు, తక్షణ చర్యలు తీసుకోవాలని కార్యకలాపాలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, వాగులు భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లే పరిస్థితి నెలకొంది, ప్రతి చెరువు కట్టవద్ద ఇంజనీర్లు, క్షేత్ర అధికారులు తనిఖీ చేయాలి. చెరువుల సమీప గ్రామాలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలి. చెరువుల కట్టలు, వాగులవద్ద ఇంజనీర్లు తనిఖీలు నిర్వహించి భద్రత చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు .
ఇంటింటికీ తిరిగి ఇంటెన్సివ్ జ్వర సర్వేలు నిర్వహించి, సత్వర చికిత్సలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని ముఖ్యమైన మందులు అందుబాటులో ఉండేలాచూసుకోవాలని అన్నారు. తండాలలో గర్భిణీ స్త్రీలు (EDD - Expected Date of Delivery) నిశితంగా పర్యవేక్షణలో ఉండాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు రోజువారీగా ఉంటూ గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితుల నివేదికలను సమర్పించాలని తెలిపారు . తాండాలలో గర్భిణీ స్త్రీలు ఎటువంటి ప్రమాద పరిస్థితిని ఎదుర్కోకుండా ముందస్తు వైద్య చర్యలు చేపట్టాలని ప్రతి కేసును నిశితంగా పర్యవేక్షించి, తల్లీబిడ్డల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను అన్నారు. మున్సిపల్ పరిధిలోని పాలిటీలుమ్స, గ్రామ పంచాయతీ ప్రాంతాలలో వర్షపు నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దోమల పెరుగుదలను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వదలడం, దోమల మందు పిచికారి నిర్వహించడం తప్పనిసరి అని ఆదేశించారు. అన్ని లోతట్టు ప్రాంతాలు , మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయాలని తెలిపారు . వాహకాల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి పారిశుద్ధ్య చర్యలను బలోపేతం చేయాలన్నారు . పట్టణ ,గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యమైన రహదారులు, జంక్షన్లలో గుంతలను వెంటనే పూడ్చే చర్యలు చేపట్టాలి.
త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని RWS & మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
ప్రతి గ్రామంలో రోజువారీగా నీటి నమూనాలు సేకరించి ల్యాబ్ పరీక్షలు చేయాలి. ప్రతీ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలో నీటి నిల్వ ట్యాంకులను క్లోరినేట్ చేసి శుద్ధి చేయాలి. మురికినీరు లేదా మట్టికణాలు కలిసిన త్రాగునీటిని శుద్ధి చేయడానికి అలమ్, క్లోరిన్ వాడకం తప్పనిసరని సూచించారు. అలాగే ప్రధాన జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ రహదారులన్నీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని ఆర్?అండ్ బీ, పంచాయతీ రాజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాహన రాకపోకలకు ఆటంకం కలుగకుండా, రహదారుల భద్రత, మరమ్మత్తుల తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, గుంతలు ఏర్పడటం, వాహన రాకపోకలకు ఆటంకం కలుగకుండా తక్షణ తనిఖీలు నిర్వహించి కలగడం సహజం. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని తెలిపారు . రోడ్లలో గుంతలు ఉన్న చోట తాత్కాలిక మరమ్మత్తులు 48 గంటల్లోపు పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి , సంగారెడ్డి తహసీల్దార్ జయరామ్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు పలువురి పరామర్శ





**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 28**
సోదరుని వియోగానికి గురైన కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కరీంనగర్ డెయిరీ చైర్మన్ చెల్మెడ రాజేశ్వరరావు, బీఆర్ఎస్ నేత, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, హుజురాబాద్ కు చెందిన పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి, పెద్దపల్లి కాంగ్రెస్ నేత పెరుక శ్యామ్ తో పాటు కరీంనగర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్ తదితరులు పరామర్శించారు.

## భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలలకు శుక్రవారం సెలవు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**



భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు శుక్రవారం (29.08.2025) సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు విధిగా సెలవు పాటించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు.

## వరద ముంచెత్తడంతో గ్రామాలు ఖాళీ సురక్షిత ప్రాంతాలకు తరలిన ప్రజలు

**కరపత్రం ప్రతినిధి కామారెడ్డి,ఆగస్ట్28**
భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలను వరద ముంచెత్తుతోంది. ఈక్రమంలో డోంగ్లి మండలంలోని సిర్పూర్, హాసన్ టాక్లి, పెద్దటాక్లి గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. పొరుగు గ్రామాల్లోని తమ బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. చిన్నారులు, వృద్ధులు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ (సలాబత్ పూర్) ఆంజనేయస్వామి ఆలయంలో తలదాచుకున్నారు. పెద్ద టాక్లీలోని కొన్ని కుటు-ంబాలు డోంగ్లి మండల కేంద్రానికి వెళ్లాయి. సిర్పూర్‌లో 246, పెద్దటాక్లిలో 190, హాసన్ టాక్లిలో 120 కుటు-ంబాల ఝారు తమ ఇళ్లకు తాళాలు వేశారు. పిట్లం మండలం కుర్తి గ్రామం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. నియోజక వర్గంలోని నిజాంసాగర్, కౌలాస్ నాలా జలాశయాల గేట్లు- ఎత్తి వరద నీటిని దిగువ మంజీరాలోకి విడుదల చేస్తున్నారు.

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ నరసింహ మెదక్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన





**కరపత్రం ప్రతినిధి నర్సాపూర్ ఆగస్టు 28**
వరద బాధితులతో మాట్లాడారు . లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు .
గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాల వల్ల రామాయంపేట జలదిగ్బంధంలో చిక్కుకుందన్నారు . గత రెండు రోజుల నుండి భారీ వర్షాలలో చిక్కుకున్న 60 మందిని జిల్లా డిజాస్టర్ యంత్రాంగం ,రెవిన్యూ , పోలీసులు , వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కాపాడారన్నారు . ఇద్దరూ వ్యక్తులు గల్లంతయ్యారన్నారు . వరదల్లో కొట్టుకుపోయిన ఒకరి మృతదేహం లభించిందని మంత్రి వెల్లడించారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు . జిల్లా కు చెందిన ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కాపాడే పనిలో నిమగ్నమై ఉన్నారన్నారు. వరద ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ లతో మంత్రి టెలిఫోన్లో సమీక్షించారు. గత 50 ఏళ్ల లో ఇంతటి భారీ వర్షాలను చూడలేదని స్థానిక ప్రజలు మంత్రికి తెలిపారు.
మెదక్ జిల్లాలోని రామాయంపేట లోని కామారెడ్డి రోడ్ లో ఉన్న బీసీ కాలనీ నీటి మునిగిన ఇండ్లను వరదని ఉద్రిత్తిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరిశీలించారు. రామాయంపేటలోని వరద ప్రభావిత ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలను మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు గారితో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు.
లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి నిత్యవసర వస్తువులను భోజనాలను బట్టలను బెడ్ షీట్లను అందజేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. నిజాం పేట మల్క చెరువు , కోనాపుర్ , నందిగామ రోడ్డు లో దెబ్బ తిన్న బ్రిడ్జి , సాయి చెరువు అలుగు లను క్షేత్ర స్థాయిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ్ పరిశీలించారు.
వచ్చే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలు రెవిన్యూ ,పోలీస్ ,డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బందికి సహకరించాలని మంత్రి ప్రజలకు సూచించారు. భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలని సూచించారు. దెబ్బతిన్న ఇండ్లు , పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లు పరిశీలించారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు జననష్టం జరగకుండా నష్ట నివారణ చర్యలను చేపడుతున్నామన్నారు .దెబ్బతిన్న రోడ్లను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. పంట నష్టం .ఆస్తి నష్టం అంశాలను రెవిన్యూ యత్రాంగం అంచనా లు రూపొందిస్తున్నారన్నారు . గత 50 ఏళ్ల చరిత్రలో ఇంతటి వర్షం కురవలేదన్నారు . రామాయంపేట , కామారెడ్డి, మెదక్ లలోని కొన్ని మండలాలలో, ప్రాంతాలలో సుమారు 200 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదయింద అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని మంత్రి వెల్లడించారు. ప్రజలకు పూర్తి అండగా ప్రభుత్వ యంత్రాంగం ఉందన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ్ . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రులు , రాష్ట్ర , జిల్లాస్థాయి అధికారులు నిరంతరం సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ్ .

## నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ లో ఘనంగా గణేష్ ఉత్సవాలు..



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 28:**
గోదావరిఖనిలోని రామగుండం నగరపాలక షాపింగ్ కాంప్లెక్స్ శివాజీ నగర్ వస్త్రమూట సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి నీ పురస్కరించుకొని వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణనాథునికి ఘనంగా పూజలు నిర్వహించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నామని సదయ్య, గోలి శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరిఖని పట్టణంలో వస్త్రముటా సంఘం ఆధ్వర్యంలో జరిగే నవరాత్రి ఉత్సవాల్లో వినాయకునికి గడిచిన కొన్ని సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని. ప్రతి సంవత్సరం అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ ఉంటుందని, ఎంతోమంది వచ్చి వినాయకుని దర్శించుకుంటారని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వినాయకునికి పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు నామని మూర్తి, ఆడెపు రమేష్, గోలి రంగయ్య, పి.గట్టయ్య, ఎం.రమేష్, ఎం.శ్రీను, విజ్ఞాన్ పాల్గొన్నారు.

## జమ్మికుంట మండలంలో కూలిపోయిన ఇండ్లకు నష్టపరిహారం కోసం పర్యవేక్షించిన తహసిల్దార్ వెంకటరెడ్డి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 28**





కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం లో మండల తహసిల్దార్ నల్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులకు కురుస్తున్న వానలకు ప్రజలు పాత గోడల వద్ద మానేరు పరివాహ ప్రాంతాలలో రైతులు ప్రజలు కరెంటు మోటార్ల ఆన్ చేసే క్రమములో రైతులు జాగ్రత్త పాటించాలని తడిచేతులతో మోటార్ ఆన్ చేయకూడదని అన్నారు అలాగే భారీ వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులు అంచనా వేయడం కొరకు జమ్మికుంట మండలం కోరపల్లి పాపక్కపల్లి వావిలాల గ్రామాలలో పలు కూలిపోయిన ఇండ్లకు నష్టపరిహారం అంచనా వేయడం కోసం పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల తహసిల్దార్ నల్ల వెంకటరెడ్డి .ఎంపీడీఓ గిర్దవార్, సత్యనారాయణ గ్రామ కార్యదర్శి గ్రామంలో పర్యవేక్షించిడం జరిగింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఆగస్ట్ 29 2025

# లోతట్టు ప్రాంతాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 28**
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీ, హరితనగర్, కృష్ణ కాలనీ ఆబాదీ జమ్మికుంట లోతట్టు ప్రాంతాలను గురువారం తహసీల్దార్ వెంకట రమణ, పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ లతో కలిసి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ.... ముందు జాగ్రత్త చర్యలుగా నిన్న రాత్రి నుండి మున్సిపల్ శానిటేషన్ అధికారుల, సిబ్బంది పని చేశారని, రాబోయే మరో రెండు రోజుకు అధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ముందుగానే శిథివస్థలో ఉన్న పలు ఇండ్లను నోటీసులు ఇచ్చి కూల్చి వేశామని, మిగిలిన మరికొన్ని శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని వారు చుట్టాల ఇంటికి, సురక్షితమైన ప్రాంతాలకు తరలివెళ్ళాలని ఆయన సూచించారు. ఈ వర్షాల వల్ల అంటువ్యాధులు



అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఫోగింగ్, బ్లీచింగ్, లైన్ మిక్స్ చేశామని, గత 15-20 రోజుల క్రితం నీరు నిల్వ ఉన్న చోట గం ఫిష్, ఆయిల్ బాల్స్ వేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ, ఇండ్లలో నీరు నిల్వ ఉన్న తొట్టిలో, కొబ్బరి బొండాలలో, టైర్లతో పాటు పలు వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,



దాని వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ వర్ష కాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆయన సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్లు మహేష్, సదానందం, ఈ శ్రీకాంత్ లతో పాటు మున్సిపల్ జవాన్లు, పరిశుద్య కార్మికులు పలువురు ఉన్నారు.

## మట్టి వినాయకుల ఉచిత పంపిణీ చేసిన యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల కృపాసాగర్.



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 28**
రణాన్ని కాపాడే దిశగా ముందడుగు వేసే ఉద్దేశ్యంతో వినాయక చవితి సందర్భంగా కమాన్ పూర్ గ్రామంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల కృపాసాగర్ మట్టి వినాయకుల ఉచిత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ హితంగా ఉండే మట్టి వినాయక విగ్రహాలను ప్రజలు ప్రోత్సహించాలని. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వలన జలవనరులకు కలిగే హానిని నివారించేందుకు మట్టి వినాయకుల విస్తృత వినియోగించాలని కోరుకున్నారు.

# జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**– ఈ పరిస్థితుల్లో అత్యవసరమైతే తప్ప ఎవరూ ప్రయాణాలు చేయకూడదని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.**

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు పొంగిపొర్లుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని, వాటి దగ్గర గుమికూడడం, నీటిని చూడటానికి వెళ్లడం లేదా అతిఉత్సాహంతో దాటడానికి ప్రయత్నించడం పూర్తిగా నివారించాల్సిందిగా ఆయన సూచించారు. ఇలాంటి చర్యలు ప్రాణ నష్టానికి దారితీసే అవకాశం ఉందని ఎస్పీ గారు స్పష్టంచేశారు. అలాగే శిథిలావస్థలో



ఉన్న పాత గృహాలలో ఎవరూ నివసించవద్దని, అలాంటి ఇళ్లు ఎప్పుడైనా కూలిపోవచ్చని హెచ్చరించారు. ప్రజలు తాత్కాలికంగా సురక్షిత ప్రదేశాలలో ఉండి పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. జిల్లా పోలీసు శాఖ తరపున అధికారులు, సిబ్బంది అన్ని ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రజల ప్రాణ భద్రత అత్యంత ప్రాధాన్యం కాబట్టి, అందరూ అప్రమత్తంగా ఉండి పోలీసు విభాగానికి సహకరించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు."

## మృతుడి కుటుంబానికి సగర సంఘం జిల్లా కమిటీ పరామర్శ




**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట : ఆగస్టు 28**
జమ్మికుంట పట్టణానికి చెందిన చిదురాల శంకరయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న కరీంనగర్ జిల్లా సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాసు సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టరాజు సగర, జిల్లా కోశాధికారి కాటిపెల్లి కుమారస్వామి సగర తదితర నాయకులు గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సగర సంఘం నాయకులు కుర్మిండ్ల అశోక్‌కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 28:**
శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏరియల్ మార్గం ద్వారా పెద్దపల్లి జిల్లా లోని గోలి వాడ పంప్ హౌస్ వద్ద ఉన్న హెలిపాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం అంతర్గాంలోని శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు ను సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తం కుమార్ రెడ్డి, టి పి సి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టుకు వస్తున్న వరద, ప్రస్తుతం



ఉన్న నీటి నిలువ, దిగువకు వదులుతున్న వరద మొదలగు వివరాలను ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వహణ పకడ్బందిగా ఉండాలని, వరద ముగిసే సమయానికి ప్రాజెక్టు నీటి నిల్వ పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టాలని సీఎం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వరద పెరిగే నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. గోదావరి నీటిని తెలంగాణ రాష్ట్ర ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా జంక్షన్ లాగా ఎల్లంపల్లి ప్రాజెక్టును ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని సీఎం తెలిపారు. నిపుణులు, ఇంజనీర్ల సూచనలు, సలహాలు తీసుకొని కాళేశ్వరం ప్రాజెక్టు లోని మేడిగడ్డ , అన్నారం, సుందిల్ల ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మత్తు అవకాశాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట ఇరిగేషన్ సి.ఈ. సుధాకర్ రెడ్డి, ఎస్.ఈ. శ్రీనివాస్ గుప్తా, అదనపు కలెక్టర్ రెవెన్యూ వేణు, ఆర్డీవో గంగయ్య, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఆగస్టు 28:**



విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణలకు మేడిపల్లి సెంటర్లో గురువారం సిపిఎం ఎన్టిపిసి రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు విధానాలకు తలొగ్గి విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసి ప్రజలపై విద్యుత్ చార్జీల భా రాన్ని మోపే చర్యలను వ్యతిరేకిస్తూ వామ పక్షపార్టీలు సుదీర్ఘ పోరాటం చేపట్టి.. చలో హైదరాబాద్కు పిలుపునిచ్చాయన్నారు. లక్షలాది మంది శాంతియుతంగా చేపట్టిన నిరసన ప్రదర్శన పై పోలీసులు పాశవీకంగా జరిపిన కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి తూటాలకు బలై నేల కొరిగి వందలాది మంది గాయాల పాలయ్యారని తెలిపారు. పోరాటం జరిగి 25 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికే ఈ ప్రభుత్వం కూడా విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడానికి, చార్జీలు పెంచడానికి సాహసం చేస్తుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 2020 విద్యుత్ చట్టంతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసి.. సబ్సిడీలు ఎత్తివేసే పని చేయడానికి సిద్ధంగా ఉందని ఆరోపించారు. అందుకే విద్యుత్ ఉద్యమ అమరుల పోరాట స్ఫూర్తితో విద్యుత్ రంగాన్ని రక్షించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, పి.సునీత, టి.రవీందర్, ఎం.సాంబయ్య, కె.పురుషోత్తం, లక్ష్మయ్య, నాగార్జున, లక్ష్మణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల లోయర్ మానేరు డ్యామ్

**– గేట్లు ఎత్తే అవకాశం ఉంది**
**– రైతులు గొర్రె కాపర్లు పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలి తహసీల్దార్ వెంకటరెడ్డి**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 28**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో జమ్మికుంట తహసిల్దార్ వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేయునది ఏమనగా - లోయర్ మానేరు డ్యామ్ ఎగువ ప్రాంతాలలో గత రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు మిడ్ మానేర్ రిజర్వాయర్ నుండి వస్తున్న వరద డ్యామ్ లోకి వచ్చి చేరుతుంది దీనితో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతుంది. కావున రేపు అనగా తేది. 29. 08.2025 ఉదయం తొమ్మిది నుండి పది గంటల మధ్య సమయంలో స్పిల్వే వరద గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలే అవకాశం ఉన్నందున ప్రాజెక్టు దిగువన నది పరిసర ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే పశువుల కాపర్లు, గొర్ల కాపరులు, చేపలు పట్టేవారు, రైతులు మరియు సామాన్య జనం మానేరు నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి.
ఈ హెచ్చరికలు మానేరు నదికి వరదలు ఉన్నన్ని




రోజులు అనగా అక్టోబర్ చివరి వరకు వర్తిస్తాయని గమనించగలరు
గత రెండు రోజుల వర్షాలు & మిడ్ మానేర్ నుండి వస్తున్న వరద నీటి కారణంగా లోయర్ మానేరు డ్యామ్ నీటి మట్టం పెరుగుతోంది.
29-08-2025 ఉదయం 9.00 %-% 10.00 గంటల మధ్య స్పిల్వే గేట్లు ఎత్తే అవకాశం ఉంది.
కాబట్టి ప్రాజెక్టు దిగువన ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా - పశువుల కాపర్లు గొర్రెల కాపర్లు చేపలు పట్టే వారు రైతులు సాధారణ ప్రజలు మానేరు నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దు. ఈ హెచ్చరికలు వరదలు కొనసాగినంత కాలం, అక్టోబర్ చివరి వరకు జమ్మికుంట తాసిల్దార్ నల్ల వెంకటరెడ్డి ప్రజలను కోరారు

## రక్తదానం చేసిన కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 28:**
అత్యవసర సమయంలో గోదావరిఖని సింగరేణి హాస్పిటల్ లో సర్జరీ నిమిత్తం బి పాజిటివ్ రక్తదానం చేసిన రామగుండం కార్పోరేషన్ 54వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ పీక భరత్ రక్తదానం చేసిన భారత్ ను మాజీ కార్పోరేటర్ ఎండీ ముస్తఫా, కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోర్డినేటర్ దూళికట్ట సతీష్, పీక అరుణ్ కుమార్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.

